క్లుప్తంగా

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి



సూర్యకుమారిని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు (మెట్రో) : జిల్లా పరిషత్ చైర్మన్‌గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు శుక్రవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు మరింతగా ప్రజలకు చేరువ కావాలని అన్నారు. జిల్లా అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు ఘంటా ప్రసాదరావు ఉన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

గణపవరం: గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది మీ ఇంటికే వచ్చి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు ఇస్తారని, ఈసేవలను వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్ నాయుడు, కిరణ్మయి అన్నారు. గణపవరం మండలం ముగ్గళ్లలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైపర్ టెన్షన్, డయాబెటిస్ ఉన్న రోగులను పరీక్షించి వారికి నెలకు సరిపడ మందులు అందజేశారు. అన్ని సచివాలయాల్లో ఈకార్యక్రమం నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. ప్రతీ నెల రెండు పర్యాయాలు వైద్యసిబ్బంది గ్రామాలకు వచ్చి ఉచిత వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. రక్త పరీక్షలు, సీరుడు పరీక్షలు నిర్వహించి, రోగ నివారణకు అవసరమైన మందులు ఇస్తారని చెప్పారు. మంచానికే పరిమితమైన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి ఉగ్రరూపం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం శుక్రవారం నిప్పుల కొలిమిగా మారింది. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి ఎండ వేడిమి ప్రారంభమయ్యింది. వేసవి ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ ఇంత వేడిమి ఎప్పుడు లేదని స్థానికులు అన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా మారాయి. 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవడంతో ఎండ వేడిమి తాళలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నారుమడులు వేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

గణపవరం: రైతులంతా జూన్ నెలాఖరుకు సార్వా నారుమడులు పూర్తి చేసుకోవాలని తాడేపల్లిగూడెం డివిజన్ ఏడీఏ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం సరిపల్లె రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా సంఘం ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్, కె.జగపతిరాజు అధ్యక్షత వహించారు. సదస్సులో మురళీకృష్ణ మాట్లాడుతూ సార్వాకు ఎంటీయూ 7029, ఎంటీయూ 1318 రకాలు అనుకూలమని రైతులు ఈ రకాలను విత్తుకోవాలని సూచించారు. కౌలు రైతులు 2023–24 సంవత్సరానికి సంబంధించి పంట సాగు హక్కు పత్రాలను తీసుకోవాలన్నారు. సదస్సులో వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, తహసీల్దార్ పమ్మి లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీపర్రు ఉపసర్పంచ్‌గా జ్యోతి

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం శ్రీపర్రు పంచాయతీ ఉపసర్పంచ్‌గా పేరం జ్యోతి ఎన్నికయ్యారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ ఎన్నిక జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తూ 12 మంది వార్డు సభ్యుల సమక్షంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 11 వార్డు సభ్యుడు పాగుర్ల జయనేంద్ర ఉపసర్పంచ్ జ్యోతి పేరును పేర్కొనగా సభ్యులు బలపరిచారు. దీంతో జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సరళకుమారి ప్రకటించి ధ్రువీకరణపత్రం అందజేశారు. గురువారం సభ్యులు హాజరుకాకపోవడంతో శుక్రవారం ఈ ఎన్నిక నిర్వహించారు. ఏడాది క్రితం గురిందల కనకరాజు రాజీనామాతో ఎన్నికల సంఘం ఈ ప్రక్రియ చేపట్టింది.

ఏలూరులో దొంగల హల్‌చల్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో రాత్రివేళల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఇద్దరు దొంగలు మోటారు సైకిల్‌పై నగరంలో తిరుగుతూ పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్టు తెలుస్తోంది. వీరిద్దరినీ నైట్‌బీట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ ఆధ్వర్యంలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వారిద్దరూ అమీనాపేట పోలీసుల రామాలయం హుండీ, గ్జేవియర్ నగర్‌లోని బిషప్ హౌస్ చర్చి హుండీ పగులగొట్టి నగదు కాజేసినట్లు తెలుస్తోంది. ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలతో రాత్రి వేళల్లో నిఘా పెంచినట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

బాధితులకు బాసటగా ముఖ్యమంత్రి ఈ-ఐ వైద్య కేంద్రం

- నేత్ర సమస్యలకు మెరుగైన వైద్యం
- వైద్య పరీక్షల కోసం రూ.14 లక్షలతో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు



పథకం లోగో



దెందులూరు సీహెచ్‌సీలో పరీక్షలు చేస్తున్న కంటి వైద్యులు

దెందులూరు: సర్వేంద్రియానం.. నయనం ప్రధానం అన్న సూక్తికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తూ పేదలకు అపన్నహస్తం అందిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో నియోజకవర్గ వైద్యశాల (సీహెచ్‌సీ), దెందులూరులో ముఖ్యమంత్రి ఈఐ పథకంలో కంటి సమస్యలు, కంటిలో నరాలు వ్యాధులకు ఉచితంగా చికిత్స చేస్తున్నారు. కంటికి సంబంధించి ఎంత మేర దృష్టి లోపం ఉందో పరీక్షలు చేసి కేవలం పది రోజుల్లో కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తున్నారు. రూ.14 లక్షలతో ప్రభుత్వం మంజూరు చేసిన కంటి పరీక్ష వైద్య పరికరం రూ.7 లక్షలు, కంటిలో నరాల పరీక్షకు వైద్య పరికరం రూ.7 లక్షలతో అత్యాధునిక వైద్య పరీక్షలు నియోజకవర్గం పరిధిలోని దెందులూరు సీహెచ్‌సీలోనే చేస్తున్నారు. 2018లో ఈ పథకం ప్రారంభమైంది. ఇప్పటి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 10,805 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. 15,020 మందికి ఇప్పటి వరకు పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గంలో విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు అన్ని వయస్సుల వారు ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకుంటున్నారు. వీటిలో కంటిలో నరాలకు సంబంధించి పరీక్షలు చేయడం కోసం ప్రత్యేక పరికరం వైద్యశాలకు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో కంటిలోపం, కంటిలో నరాల లోపం ఉన్న ప్రతి ఒక్కరికీ ఈఐ కేంద్రంలో అందించే సేవలు దీర్ఘకాలిక ప్రయోజనాలు, భద్రత అందించనుంది.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ముఖ్యమంత్రి జగన్ రూ. 14లక్షల విలువైన అత్యాధునిక కంటి వైద్య పరీక్షలు చేసే పరికరాలు అందించారు. కంటి పరీక్ష, కంటి నరాల పరీక్ష చేసే పరికరాలను దెందులూరు సీహెచ్‌సీకి మంజూరయ్యాయి. నియోజకవర్గంలో కంటి సమస్యలున్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దెందులూరు నియోజకవర్గంలో బాధిత ప్రజలకు బాసటగా నిలుస్తూ వైద్య సిబ్బంది సహకారంతో మెరుగైన వైద్యం అందిస్తాం.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

వృద్ధులకు, చిన్నారులకు వరం



ముఖ్యమంత్రి కంటి వైద్య పథకం వృద్ధులకు, చిన్నారులకు, పేద, బడుగు, బలహీనవర్గాలకు ఉపయోగపడుతుంది. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేటు ఆస్పత్రులలో వైద్య పరీక్షలు, చికిత్స చేయించుకోవడం పేదలకు కుదరని పని. బాధితుల మేలు కోరి మెరుగైన సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి రుణపడి ఉంటాం.

– జిత్రిపోతుల సువార్తమ్మ, వట్లూరు

విస్తృత ప్రచారం చేయాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితుల కోసం అమలు చేస్తున్న ఈ పథకంపై నియోజకవర్గంలో స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేయాలి. కంటిపరీక్ష, కంటిలో నరాల పరీక్షకు సంబంధించి అత్యాధునిక పరికరాలు ఉపయోగించుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు ఈ పథకంపై నిర్వహించే ప్రచారంలో భాగస్వామ్యం కావాలి.

– బండి శ్రీనివాసరావు, బీఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, దెందులూరు

రేపు చిన్నారులకు మధుమేహ వైద్య శిబిరం

ఉంగుటూరు: ఆలిండియా డయాబెటీస్ రీసెర్చి అసోషియన్ అధ్యక్షుడు డా.పీవీ రావు ఆధ్వర్యంలో రేపు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి డా.పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో చిన్న పిల్లలకు ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పర్యవేక్షకుడు పాతూరి వంశీ తెలిపారు. గతంలో రిజిస్టరు చేయించుకున్న 18 ఏళ్ల లోపు పిల్లలు 80 మందికి ఇన్సులిన్, సుగర్ టెస్టు కిట్లు, ప్రొటీన్ పౌడరు, పౌష్టికాహారం, ఉచితంగా ఇస్తామని ఆయన తెలిపారు.

నేడు వట్టి వసంత్‌కుమార్ జయంతి

ఉంగుటూరు: మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ 70వ జయంతిని శనివారం ఉంగుటూరులో నిర్వహించేందుకు ఆయన అభిమానులు సన్నాహాలు చేస్తున్నారు. బొమ్మిడి సొసైటీ మాజీ అధ్యక్షుడు మైలవరపు గోపాలకృష్ణ, మాజీ జెడ్పీటీసీ కాటి కిరణ్, రాచూరు కుచెందిన మంద శ్రీనివాసరెడ్డి, వసంత్ యూత్ అధ్యక్షుడు బాలాజీ, కాకర్లమూడి నాని అభిమానులు నడుం బిగించారు. ఉంగుటూరులో రక్తదాన శిబిరంతో పాటు చేబ్రోలు, కాగుపాడు, బీమడోలు, గుండుగొలను, పూళ్ల, నిడమర్రు, గణపరం మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని రోగులకు పండ్లు, రొట్టెలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు మాజీ జెడ్పీటీసీ కిరణ్ వెల్లడించారు. నియోజకవర్గంలోని వసంత్‌కుమార్ అభిమానులందరూ పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పాలనను అన్ని వర్గాలకూ చేరువ చేశాం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- నిడమర్రులో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం



నిడమర్రులో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పాలన చేరువ చేశారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నిడమర్రులో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం శుక్రవారంతో ముగిసింది. నియోజకవర్గంలో చేపట్టిన ఈ కార్యక్రమం 165వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గడపగడపకు ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ లబ్ధిదారులకు సంక్షేమ బ్రోచర్లను వాసుబాబు వ్యక్తిగతంగా అందించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పరిపాలనను ప్రతి కుటుంబానికి తీసుకువెళ్లడంతో ప్రథకాల లబ్ధి నేరుగా అర్హుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రభుత్వం నుంచి ఏదో ఒక విధంగా లబ్ధి పొందుతున్నామంటూ ప్రజలు ప్రభుత్వ పథకాల అమలుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితికి మించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చేలా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. అర్హుడైన ప్రతి వ్యక్తి నాయకులు, దళారులు చుట్టూ తిరగకుండా నేరుగా గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి స్వయంగా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందే అవకాశం రాష్ట్ర ప్రజలకు మాత్రమే ఉందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వాసుబాబు ఓటర్లను కోరారు. గడపగడపకు వెళ్లిన పుడు స్థానికులు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా ఎమ్మెల్యే వాసుబాబు గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, దూసనపూడి సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడిసే జాన్‌బాబు, సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు, ఉపసర్పంచ్ పోలిశెట్టి మురళి, సచివాలయం కన్వీనర్ తలమంటి వెంకటేష్, నీటి సంఘం అధ్యక్షుడు మండ పోలయ్య, చలంశెట్టి బాబులు, ఎలిశెట్టి మురళి, రుద్ర సుబ్బారావు, కన్నాజి రామకృష్ణ, నూతాని యోసు, అంబళ్ల శ్రీను, పతివాడ శ్రీను, శానపతి శ్రీను, కన్నాజి బాలాజీ, వగ్వాల నాని తదితరులున్నారు.

నేడు సూరప్పగూడెంలో గడపగడపకు..

భీమడోలు: మండలంలోని సూరప్పగూడెంలో ఈనెల 10వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నాలుగేళ్లలో పథకాల ద్వారా ఇంటింటికీ చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారికి బ్రోచర్లు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి రక్షణ



కాకర్లమూడిలో ప్రజలను చైతన్యపరుస్తున్న కాగుపాడు ఆరోగ్య సిబ్బంది

ఉంగుటూరు: సరైన వైద్య సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చునని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ పర్యవేక్షకుడు లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం కాగుపాడు ఆరోగ్య సిబ్బందితో కలిసి కాకర్లమూడిలో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలులు వడదెబ్బ డీహైడ్రేషన్ రావడం సహజమని సకాలంలో స్పందించి చికిత్స పొందాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది సలహాలు పాటించాలని ప్రజలకు సూచించారు. చెమట పట్టకపోవడం, వణుకు, శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుదల, పెదాలు ఎండిపోయి, నోరు పిడిచకట్టడం, మగత నిద్ర లేదా కలవరింతలు, పిట్స్ లేదా అపస్మారక స్థితికి చేరుకోవడం వంటి లక్షణాలున్న వారు జాగ్రత్త పడాలన్నారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం కాటన్ వస్త్రాలు ధరించటం, రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలని సూచించారు. భోజనం మితంగా చేయాలని, పరిశుభ్రంగా ఉండాలని, ఎండవేళలో ఇంటిలోనే ఉండాలని, బయటకు వెళితే గొడుగు, టోపీ, లేదా రుమాలు వినియోగించాలని సూచించారు. సచివాలయ కార్యదర్శి జి.కల్పన, ఆరోగ్య కార్యదర్శి కె.వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎం. శ్రీనివాసరాజు, ఎంఎల్ అనిత, ఆశాకార్యకర్తలు సంధ్య, జ్యోతి, కుమారి వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గుండుగొలనులో బహుమతులు అందుకున్న చిన్నారులు



భీమడోలులో చిన్నారులకు శిక్షణ అందిస్తున్న తుమ్మల ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్

భీమడోలు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గుండుగొలను నం.1 పాఠశాల హెచ్‌ఎం పి.పాండురంగారావు అన్నారు. గుండుగొలను, భీమడోలు, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో శుక్రవారం 33వ రోజైన శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులు ఉల్లాసంగా నిర్వహించారు. గుండుగొలనులో ఏర్పాటు చేసిన ముగింపు సభకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నల్ల శంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాశం పాండురంగారావు మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్నారులు సెల్‌ఫోన్‌కు దగ్గరై పుస్తకాలకు దూరంగా ఉంటుందన్నారు. దీని వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా బలహీనులవుతున్నారన్నారు. గ్రంథాలయ సంస్థ చిన్నారులను పుస్తకం వైపు మళ్లించేందుకు ఈ వేసవిలో నిర్వహించిన శిక్షణ తరగతులతో అద్భుతమైన ఫలితాలిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి రోజూ గ్రంథాలయాన్ని సందర్శించి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అభివృద్ధి కమిటీ చైర్మన్, వార్డు సభ్యుడు నల్ల శంకర్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థులు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. గ్రంథపాలకురాలు జి.నాగమణి విద్యార్థులకు అనేక విషయాల్లో నిష్ణాతులైన రిసోర్స్‌పర్సన్లతో శిక్షణ అందించారన్నారు. అనంతరం శిక్షణ అందుకున్న చిన్నారులకు బహుమతులను అందించారు. రిసోర్స్ పర్సన్లను ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ టీచర్ బాలిన సింహాచలం, ఉపాధ్యాయుల ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్ చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ అందించారు. స్ఫూర్తిదాయక నీతి కథలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, సిబ్బంది, పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



గాలాయగూడెం గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు : ప్రతి గ్రామ శివారు ప్రాంతంలో మరింత అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం గాలాయగూడెంలో పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైద్యం, ఇంటి స్థలం, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, రుణాలు, ఇతర సమస్యలకు సంబంధించి వినతులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ప్రజలు వివరించి, వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రజల సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల ఉద్యోగులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ ఎఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ నాయకులు బోయపాటి గణేష్, మునునూరి వెంకటేశ్వరరావు, తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, వలంటీర్లు, ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: గాలాయగూడెం గ్రామ పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలని కోరారు.

12 నుంచి ప్రవేశాలు

టి.నరసాపురం : గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 12 నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అప్పలరాజుగూడెం గురుకులం ప్రిన్సిపాల్ టీఎస్ స్వామి శుక్రవారం తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్, డిగ్రీ ప్రవేశానికి పరీక్ష ద్వారా అర్హులను ఎంపిక చేశామన్నారు.

పీహెచ్‌సీలో సురక్షిత్ మాతృత్వ అభియాన్

దెందులూరు: పోతునూరు పీహెచ్‌సీలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారిని సీహెచ్‌కే చైతన్య నిర్వహించారు. ప్రతి నెలలో 2,3వ త్రైమాసిక గర్భిణులకు 42 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 8 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. ప్రతి గర్భిణికి ఐరన్, పొలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు అందించారు. స్త్రీల గర్భకోశ వ్యాధులు, ప్రసవం, తదితర పరిణామాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎగ్జిక్యూటి ర్ సీహెచ్‌ఓ అలివేలు, అరుంధతి, హెచ్‌వీ సత్యవతి, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో భోజనశాల నిర్మాణం





పెదపాడు మండలంలోని వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి విరాళం అందిస్తున్న విశ్రాంత వీఆర్వో డీవీ సుబ్బారావు, వట్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న భోజనశాల

పెదపాడు: పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దల సహకారంతో మండలంలోని వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మిస్తున్నట్టు ఏలూరు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి అన్నారు. ఈ సందర్భంగా సతీష్‌చౌదరి మాట్లాడుతూ గ్రామ పెద్దలు, దాతల సహకారంతో రూ.17.50 లక్షల వ్యయంతో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద భోజన శాలను విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణానికి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థి కట్నే అజయ్ తొలుత రూ.8లక్షలు విరాళం అందించారని చెప్పారు. రూఫ్ నిర్మాణానికి స్వయంగా రూ.2.50లక్షలు విరాళం అందించినట్టు చెప్పారు. వేగుంట రామబ్రహ్మం కుటుంబ సభ్యులు టైల్స్ ఫ్లోరింగ్ కోసం రూ.2,65 లక్షలు, దివ్వెల జయప్రకాష్ కిటీకీ తలుపుల ఏర్పాటుకు రూ.1లక్ష, హాల్ పెయింటింగ్‌ల నిమిత్తం విశ్రాంత వీఆర్వో దుగ్గిరాల వెంకటసుబ్బారావు రూ.లక్ష విరాళం అందించారని తెలిపారు. ఇంకా హాలు సీలింగ్, ఇతర పనుల నిమిత్తం రూ.2.50లక్షల నిధులు అవసముందని దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. పాఠశాలను నాడు– నేడు ఫేజ్2లో అభివృద్ధి చేస్తున్నామని, దీనిలో భాగంగా మంచినీటి సౌకర్యం, కిచెన్ షెడ్డు నిర్మాణం, టాయిలెట్ నిర్మాణం, ఫర్నిచర్ ఏర్పాటు వంటి పనులు పూర్తయ్యాయన్నారు. కొద్ది రోజుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నవరపు ఆదిలక్ష్మి మాట్లాడుతూ మెరుగైన వసతులు కల్పించేందుకు సతీష్‌చౌదరి విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వేగవంతం నిర్మాణం చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సీఎంఓ టీడీఎఫ్ రూజ్‌వెల్ట్ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.